
పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం పెడుతున్న కమాండెంట్ పి.వెంకటరాములు

అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: విధి నిర్వాహణలో ప్రాణాలు త్యాగం చేసిన పోలీసులను స్ఫూర్తిగా తీసుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం రామగుండం కమిషనరేట్ ఆవరణలో స్తూపానికి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ పది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా పోలీసు అమరుల కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్, అదనపు డీసీపీ రాజు, ఏసీపీలు రాఘవేంద్రరావు, రమేశ్, కృష్ణ, ప్రకాశ్, వెంకటేశ్వర్లు, నర్సింహులు, మల్లారెడ్డి, ప్రతాప్, సుందర్‌రావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం పాల్గొన్నారు.


రామగుండం కమిషనరేట్‌లో వందనం చేస్తున్న సీపీ శ్రీనివాస్, జిల్లా అధికారులు

హాజీపూర్ : దేశం కోసం ప్రాణాలు విడిచి అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని టీఎస్ఎస్‌పీ 13వ పటాలం కమాండెంట్ పి.వెంకటరాములు పేర్కొన్నారు. సోమవారం హాజీపూర్ మండలం గుడిపేటలోని టీజీఎస్ఎస్‌పీ 13వ పటాలంలో 66వ పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం గత ఏడాది పది, ఇంటర్మీడియట్, బీటెక్ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు చెక్కులు అందజేశారు.


అవగాహన ప్రతులను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా శాఖల అధికారులు

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు

ఏసీసీ, న్యూస్‌టుడే : రైతుల సౌకర్యార్థం జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారి కల్పన, మార్కెటింగ్ అధికారి మహ్మద్ షాబొద్దీన్‌లతో కలిసి పత్తి కొనుగోళ్లపై రైతు అవగాహన గోడ ప్రతులను ఆవిష్కరించారు. జిల్లాలోని 8 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 7,521 మద్దతు ధరను నిర్ణయించిందని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు.



సంత.. సమస్యలే అంతా

పరిశీలన

లక్షెట్టిపేట, జన్నారం, కాసిపేట, తాండూరు, కోటపల్లి, న్యూస్‌టుడే : జిల్లాలోని సంతల ద్వారా వచ్చే ఆదాయంపై దృష్టిసారిస్తున్న పాలకులు అక్కడ వసతుల కల్పన గురించి పట్టించుకోవడం లేదు. జిల్లాలో ప్రధాన సంతల్లో ఎక్కడ చూసినా సమస్యలే రాజ్యమేలుతున్నాయి. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో 'న్యూస్‌టుడే' బృందం పరిశీలన నిర్వహించింది.


శనివారం సంత వద్ద జాతీయ రహదారి వారు తొలగించడంతో అస్తవ్యస్తంగా మారిన షెడ్డు

వర్షమొస్తే ఇక్కట్లే

- ▲ లక్షెట్టిపేట
- ★ 550 ✦ 5500
- ■ 5 లక్షలు (సుమారు)

లక్షెట్టిపేటలో వార సంత నిర్వహణకు సరైన స్థలం ఎంపిక చేయకపోవడంతో తెలంగాణ చౌక్ నుంచి అంగడి బజార్ హనుమాన్ ఆలయం, అటవీ శాఖ కార్యాలయం, బస్టాండు నుంచి పెద్ద మజీద్ వరకు ఎక్కడ కాసింత స్థలం దొరికితే అక్కడే రహదారికి ఇరువైపుల సంత నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆయా దారులు పూర్తిగా అమ్మకందారులు, కొనుగోలుదారులతో నిండి ఉంటుంది. కనీసం సైకిల్ కూడా వెళ్లే పరిస్థితి ఉండదు. వర్షం వచ్చిందంటే అమ్మకం, కొనుగోలుదారుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది.

మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేదు

- ▲ తాండూరు ఐబీకి సమీపంలో
- ★ 150 ✦ 3500
- ■ సుమారు రూ.12 లక్షల వ్యాపారం
- ● రూ.3.33 లక్షలు
- ◆ రూ.12 లక్షలు
- ▼ 15 లక్షలు

శనివారం సంతకు ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నుంచి క్రయ విక్రయదారులు వస్తుంటారు. గతంలో కొన్ని షెడ్లు నిర్మించినా జాతీయ రహదారి విస్తరణలో వాటిని తొలగించారు. వేలాది మంది వచ్చే ఈ సంతలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేదు. పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు అస్తవ్యస్తంగా తయారైంది.

పొంచి ఉన్న ప్రమాదం

- ▲ ఉత్కూరు
- ★ 350 ✦ 4000
- ■ 3.5 లక్షలు (సుమారు)

లక్షెట్టిపేట పురపాలిక పరిధిలోని ఉత్కూర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారికి ఇరువైపుల ప్రతి గురువారం వార సంత నిర్వహిస్తున్నారు. మరో వైపు ఉత్కూర్ చౌరస్తాకు అత్యంత సమీపంలో జాతీయ రహదారిపై నిర్వహిస్తుండటంతో ప్రమాదం పొంచి ఉంది.

షెడ్లు లేక ఇబ్బందులు

- ▲ సుభద్ర కాలనీ సమీపంలో, తాండూరు
- ★ 80 ✦ 1200
- ■ సుమారు రూ.3 లక్షలు
- ▼ 15 లక్షలు

బుధవారం సంతలో ముఖ్యంగా మరుగుదొడ్లు లేవు. కూరగాయలు విక్రయించుకునేందుకు షెడ్లు లేకపోవడంతో నేలపైనే కవర్లు వేసుకొని కూరగాయలు, వస్తు సామగ్రి విక్రయిస్తుంటారు. గతంలో షెడ్ల కోసం పిల్లర్లు, దిమ్మెలు నిర్మించి షెడ్లు పూర్తి చేసినట్లు బిల్లులు తీసుకున్నారు. కానీ రేకులు నేటికీ వేయలేదు.


కోటపల్లిలో వారసంత నిర్వహించే ప్రదేశం

సమకూరని ఆదాయం

- ▲ కోటపల్లి
- ★ 22 ✦ 150
- ■ రూ.20 వేల వరకు

వారసంత నిర్వహణ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పంచాయతీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించకపోవడంతో కూరగాయల వ్యాపారులు మాత్రమే ప్రతి మంగళవారం విక్రయాలు జరుపుతున్నారు. వేలం పాట లేకపోవడంతో పంచాయతీకి ఎలాంటి ఆదాయం సమకూరడం లేదు.

- ▲ సంత జరిగే ప్రాంతం
- ★ చిరు వ్యాపారుల సంఖ్య
- ✦ అక్కడికి వచ్చే ప్రజల సంఖ్య
- ■ వ్యాపారం ● కూరగాయల సంతకు
- ◆ మేకల సంతకు (గత సంవత్సరం)
- ▼ సంత ద్వారా పంచాయతీకి వచ్చే ఆదాయం

మరుగుదొడ్ల నిర్మాణమేది?

- ▲ పొనకల్
- ★ 300 ✦ 1500
- ■ సుమారు రూ. 5లక్షలు
- ▼ రూ.6,85,000

సంతకు ఎక్కువగా వివిధ ప్రాంతాల నుంచి మహిళలు వస్తారు. కానీ ఇక్కడ ఆదాయం వస్తున్నా సరైన వసతులు సమకూరడం లేదు. మహిళలకు మరుగుదొడ్లు లేక ఇక్కట్లు పడుతున్నారు.

వాహనాల నిలుపుదలకు చోటేది?

- ▲ దేవాపూర్, కాసిపేట మండలం
- ★ 60 ✦ 1000
- ■ 80 వేలు

ప్రతీ గురువారం రహదారి మీదే వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడం ప్రధాన సమస్య. వ్యాపారులకు ప్రత్యేక మార్కెట్ స్థలం కేటాయిస్తే అభివృద్ధి చెందుతుంది.


మంచిర్యాలలో సెల్ఫీ పాయింట్ అక్షరాలు లేకుండా ఉన్న గద్దె

'మంచి మంచిర్యాల' సెల్ఫీ పాయింట్ మాయం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే : మంచిర్యాలలోని అంబేడ్కర్ చౌరస్తాలో సుందరీకరణలో భాగంగా రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన 'మంచి మంచిర్యాల సెల్ఫీ పాయింట్' మాయం అయింది. అక్కడ పట్టణ ప్రగతి నిధుల నుంచి దాదాపు రూ.20 లక్షలతో గద్దె నిర్మించి దానిపై స్టీలు గ్రిల్స్, గ్రీనరీ మొక్కలు ఏర్పాటు చేశారు. దాని మధ్యలో మంచి మంచిర్యాల అని తెలుగు భాషలో పెద్ద అక్షరాలతో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. ఆ సెల్ఫీ పాయింట్ అక్షరాలను ఎవరో తొలగించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌ను వివరణ కోరగా.. అక్కడ అక్షరాలు తొలిగించినట్టు తనకు సమాచారం లేదన్నారు. అక్కడ పరిశీలించి విచారణ చేస్తామన్నారు.

కొటేషన్ ఇవ్వకుంటే సాయం వెనక్కి

◆ కాసిపేట మండలంలో బీసీ బంధు కింద 42 మంది లబ్ధిదారులు రూ.లక్ష చొప్పున సాయం పొందారు. ఇందులో ఒక్కరుకూడా ఇంత వరకు కొటేషన్ (పరికరాల కొనుగోలు వివరాలు, ఫొటోలు) అధికారులకు సమర్పించలేదని సమాచారం. సాయం పొంది పనులు చేయడం లేదని తెలుస్తోంది.

◆ భీమిని మండలంలో 23 మందికి ప్రభుత్వం నుంచి బీసీ బంధు సహాయం అందించారు. వీరిలో ఆరుగురు మాత్రమే కొటేషన్ అందించగా.. మిగతా వారు ఇవ్వలేదని అధికారులు చెప్పారు.

న్యూస్‌టుడే, కాసిపేట

గత ప్రభుత్వం బీసీ కులవృత్తులకు బీసీ బంధు పేరిట రూ.లక్ష సాయాన్ని అందజేసింది. సాయం పొందిన లబ్ధిదారులు కులవృత్తుల పరికరాలను కొనుగోలు చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సాయం అందిస్తే.. ఏడాది గడిచినా చాలామంది పథకానికి సంబంధించిన పరికరాలు కొనుగోలు చేసుకోలేదు. మరికొంత మంది కొన్నా అధికారులకు కొటేషన్ పత్రాలను అందజేయలేదు. సాయం పొంది కొటేషన్ సమర్పించని లబ్ధిదారుల నుంచి సాయాన్ని వెనక్కి తీసుకోవాలని మండల పరిషత్తు అధికారులకు ఆదేశాలు వచ్చాయి.

● బీసీ బంధుపై తాజా ఆదేశాలు..



గత ఏడాది జూన్ 9న బీసీ బంధు పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచే ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గానికి 300 చొప్పున జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాలకు చెందిన 900 మందికి సాయాన్ని అందజేశారు. జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల అప్పటి నాయకులు రూ. లక్ష సాయం పొందిన వారి నుంచి రూ. 20 నుంచి రూ.30 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. వచ్చిన సాయంలో వీరికే రూ.30 వేలు పోతే, ఇంకా కొటేషన్‌కు రూ.5 నుంచి 10 వేల ఖర్చు అవుతుంది. దీంతో చాలామంది సాయం పొందిన వారు కొటేషన్ సమర్పించలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.


మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న లబ్ధిదారులు (పాత చిత్రం)

సాయం పొందారు.. కొటేషన్ మరిచారు

జిల్లా వ్యాప్తంగా 900 మంది బీసీ బంధు సాయాన్ని పొందగా, ఇందులో చాలామంది పరికరాలను కొనుగోలు చేయలేదని అధికారులు గుర్తించారు. అప్పుడు సాయం పొందిన లబ్ధిదారుల వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం లెక్కలు తీస్తోంది. ఎంతమంది సాయం పొందారు, కులవృత్తుల వారిలో ఎందరు పనులు చేస్తున్నారు? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. చాలాచోట్ల అప్పటి భారాస ప్రభుత్వ కార్యకర్తలే ఎక్కువమంది సాయం పొందడంతో వారు తీసుకున్న సాయాన్ని ఏ విధంగా ఉపయోగిస్తున్నారో ఫొటోలతో సహా కొటేషన్ సమర్పించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. సాయం అందినప్పటికీ పనులు చేయని వారినుంచి ఆర్థిక సాయాన్ని వెనక్కి తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.


పుస్తకాలను ప్రదర్శిస్తున్న అదనపు పాలనాధికారి మోతీలాల్

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంచాలి

హాజీపూర్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా అదనపు పాలనాధికారి మోతీలాల్ అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం పడ్డనపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదర్శ గ్రంథాలయాన్ని డీఈవో యాదయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దేందుకు రూం టు రీడ్ ఇండియా ట్రస్ట్, యూఎస్ఐడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ రావు, జిల్లా వయోజన విద్య అధికారి పురుషోత్తం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతి మత్తు.. ఆదాయం చిత్తు

● ఆబ్కారీ అధికారుల వసూళ్ల పర్వం


ఈటీవీ ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో 192 మద్యం దుకాణాలతోపాటు మరో 36 బార్ అండ్ రెస్టారెంట్లకు ప్రభుత్వ అనుమతి ఉంది. 12 మున్సిపాలిటీల పరిధిలో అనుమతులున్న దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను మినహాయిస్తే 1,519 పంచాయతీల పరిధిలో అక్రమ మద్యం దుకాణాలను అధికారులు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. గ్రామానికి ఒక్కో గొలుసుకట్టు దుకాణాల ద్వారా సగటున నెలకు రూ.5 వేల చొప్పున పరిగణనలోకి తీసుకుంటే నెలకు రూ.75.95 లక్షలు, రెండు దుకాణాలను పరిగణనలోకి తీసుకుంటే రూ.1.50 కోట్లు అక్రమ వసూళ్లే లక్ష్యంగా అధికారుల దందా కొనసాగుతోంది. కింది స్థాయి అధికారులు చేసే దందా ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతుందనే ఆరోపణలున్నాయి.

◆ బేల మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) మద్యం గొలుసు దుకాణం కోసం వేలం నిర్వహించింది. ఏడాదికి రూ. 12 లక్షలతో ఓ వ్యక్తికి దుకాణం దక్కింది. ఈ విషయం తెలిసిన ఓ ఆబ్కారీ అధికారి అక్కడికి వెళ్లారు. తనకు ఏడాదికి రూ.2 లక్షలు ఇవ్వాలని షరతు పెడితే గ్రామస్థులు అంగీకరించలేదు. చివరికి ఆదిలాబాద్‌లోని మద్యం సిండికేట్‌కు చెందిన ఓ ప్రముఖుడి వద్దకు వెళ్లటంతో నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు అధికారికి ఇచ్చేలా ఒప్పందం కుదిరింది.



ఇది బోథ్ మండలంలోని ఓ మద్యం గొలుసు దుకాణం. ఇంద్రవెల్లి, ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో కొంతమంది అధికారుల కనుసన్నల్లో గొలుసుకట్టు దుకాణాల నిర్వహణ సాగుతోంది. డబ్బులు ఇవ్వటం ఆలస్యమైతే గుడుంబా, గంజాయి కేసులు నమోదు చేస్తామని భయపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఒకటి, రెండుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా స్పందన లేదు.





నిర్మల్ జిల్లా బేల్‌తరోడ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు మహారాష్ట్ర నుంచి వచ్చే అక్రమ మద్యం సరఫరాకు వారధిగా నిలుస్తోంది. మహారాష్ట్రలో ఎన్నికలు ఉన్నందున మన మద్యాన్ని అక్కడికి పంపిస్తూ అక్కడి చౌక మద్యాన్ని మనకు చేరవేసే దందా సాగుతోంది. కొంతమంది ఎంవీఐ అధికారులైతే రాష్ట్రంలోని ఒకరిద్దరు ప్రముఖ నేతల మద్దతు ఉందని చెబుతూ మహారాష్ట్రలోని బోకర్, పాలజ్, ధర్మాబాద్ మీదుగా అడ్డదారులు చూపుతున్నారు. ఫలితంగా మహారాష్ట్ర మద్యంతో మన రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుండగా, వ్యక్తిగతంగా ఎంవీఐ, ఆబ్కారీ అధికారులకు ఆదాయం చేకూరుతోంది.



ఇది మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీసులు పట్టుకున్న రూ.3 లక్షలు విలువ చేసే అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం. ఓ బొలెరో, మరో ఆటోలో మహారాష్ట్రకు తరలిస్తుండగా పారుపెల్లి సమీపంలో పోలీసులు సీజ్ చేశారు. అకీరా, ఆసరవెల్లి, మొట్లగూడెం, కోటపల్లి, వేమనపల్లి మీదుగా మద్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొంతమంది ఆబ్కారీ అధికారులు వ్యక్తిగత లాభాపేక్షతో పని చేస్తుండటం అక్రమాలకు తావిస్తోంది.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు చర్యలు తీసుకోవాలి

ఏసీసీ, న్యూస్‌టుడే : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదు చేసుకునేలా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం జిల్లా సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి జిల్లా యంత్రాంగంతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, భూ సేకరణ ప్రత్యేకాధికారి చంద్రకళ, మంచిర్యాల తహసీల్దార్ రఫతుల్లా తదితరులు పాల్గొన్నారు.


భాజపా రాష్ట్ర కార్యదర్శి జయశ్రీని సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ తదితరులు

స్థానిక సంస్థల పోరులో సత్తాచాటుదాం

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : భాజపా సభ్యత్వ నమోదుకు రాష్ట్ర, జిల్లాల వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తుందని రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయా అంశాలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సభ్యత్వంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదామని పిలుపునిచ్చారు.

పంచాయతీ ఎన్నికల పనులు ముమ్మరం

న్యూస్‌టుడే, మంచిర్యాల గ్రామీణం

పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం సిద్ధమవడంతో జిల్లాలో అధికారులు ఎన్నికల పనులను ముమ్మరం చేశారు. పంచాయతీల పాలకవర్గం గడువు గత జనవరి నెలాఖరుతో ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ క్రమంలో ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్న క్రమంలో బీసీ కులగణన చేపట్టిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు ఏ క్షణంలో నిర్వహించినప్పటికీ సిద్ధంగా ఉండాలనే లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం పనులను వేగవంతం చేసింది. జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నందున అందుకు అవసరమైన బ్యాలెట్‌బాక్సులను సిద్ధం చేస్తున్నారు. ఓటరు జాబితాల ఆధారంగా ఓటర్లను, వార్డుల పునర్విభజన, తుది ఓటర్ల జాబితాలను ఇప్పటికే పూర్తిచేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి సిబ్బందికి అందించే శిక్షణకు అవసరమైన మాడ్యూల్స్, ఎన్నికల సామగ్రి ఇప్పటికే జిల్లా పంచాయతీ కార్యాలయానికి చేరాయి.


జిల్లా పంచాయతీ కార్యాలయంలో భద్రపరిచిన సామగ్రి

జిల్లాకు చేరిన ఎన్నికల సామగ్రి

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న క్రమంలో జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లోని 16 మండలాలకు చెందిన 311 పంచాయతీల్లో ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు పనులు వేగవంతం చేశారు. ఎన్నికల రోజున సిబ్బందికి ఉపయోగపడే సామగ్రి, ఎన్నికల అధికారులకు అవసరమైన మాడ్యూల్స్, కవర్లు, ఇతర పత్రాలు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి.

జిల్లాలోని పంచాయతీలు, వార్డులు, పోలింగ్ స్టేషన్లు, బ్యాలెట్ పెట్టెల వివరాలివే



ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉన్నాం

ఎన్నికలను ఎప్పుడు నిర్వహించేది పక్కాగా తెలియనప్పటికీ అందుకు సంబంధించిన సామగ్రిని మాత్రం జిల్లాకేంద్రాలకు పంపిస్తున్నారు. ఇప్పటికే కొంతమేరకు మాడ్యూల్స్, పుస్తకాలు, పత్రాల్లాంటివి చేరాయి. మరి కొంత చేరే అవకాశం ఉంది. కులగణన పూర్తయిన వెంటనే ఎన్నికలను నిర్వహిస్తే సిద్ధంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పనులు చేస్తున్నాం. ఇప్పటికైతే ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి ఆదేశాలు జారీకాలేదు.

- వెంకటేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, మంచిర్యాల.

సెనగ సాగుకు అనుకూలం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :

జిల్లా భూములు యాసంగిలో సెనగ సాగుకు లాభదాయకంగా ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు పొందే వీలుందని అన్నారు. వానాకాలంలో సోయా సాగు చేసిన రైతులు రెండో పంటగా సెనగ సాగు చేసుకుంటే మేలు. ఈ పంట చల్లని వాతావరణంలో పెరుగుతుందని ఆయన తెలిపారు.

ఇలా విత్తుకోవాలి..

ఎకరానికి 20 నుంచి 25 కిలోల విత్తనం అవసరం. ఆలస్యంగా వేసినట్లయితే మరో 20 శాతం అదనంగా వేసుకోవాలి. ఎండుతెగులు ఉంటే విత్తనశుద్ధి చేసుకోవాలి. కిలో విత్తనానికి నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా వాడితే మంచి ఫలితం ఉంటుంది. విత్తిన తర్వాత పెండిమిథాలిన్ ఎకరాకు 1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 25 రోజులకు గొర్రుతో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. విత్తిన 20 రోజులకు ఒకసారి తిరిగి 30-40 రోజులలో రెండో సారి కలుపుతీయాలి.



సెనగ పచ్చ పురుగు

రైతేరాజు

ఎరువులు ఇలా..

నేల స్వభావాన్ని బట్టి నేలలో లభించే పోషకాల మోతాదును బట్టి ఎరువు వాడాలి. చివరి దుక్కిలో ఎకరానికి రెండు టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఎకరా సెనగ సాగుకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. నేలలో నిల్వలు సరిపడా ఉన్నప్పుడు భాస్వరం, పొటాష్ ఎరువులు వేసే అవసరం లేదు. ఈ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. ఎకరాకు 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డీఏపీని వేసినచో పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం అందుతాయి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేసిన పంటకు కావాల్సిన గంధకము కూడా అందుతుంది.



సస్యరక్షణ

పంటను పచ్చపురుగు ఆశించి నష్టపరుస్తుంది. ఇది విత్తనాలు మొలిచిన 10-15 రోజుల నుండి ఆశించి పంట పరిపక్వదశకు చేరే వరకు ఉండి విపరీతమైన నష్టాన్ని కలిగిస్తుంది. నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. వేపకషాయాన్ని పిచికారీ చేయాలి.

విత్తనోత్పత్తి

విత్తనోత్పత్తిగా సాగు చేసే రైతులు సారవంతమైన, మురుగు నీరు నిలవని గత పంట కాలంలో సెనగ పంటను వేయని పొలాన్ని విత్తనోత్పత్తికి ఎన్నుకోవాలి. ఇతర సెనగ పంట పొలాల నుంచి కనీసం 5 మీటర్ల దూరంలో ఉండేలా చూసుకోవాలి. అక్టోబరు - నవంబరు 15లోగా విత్తనాలు విత్తుకోవడానికి అనుకూల సమయం. ఆయా ప్రాంతానికి అనువైన, తెగుళ్లను తట్టుకొని, అధిక దిగుబడిని ఇచ్చే రకాలను ఎన్నుకొని మూల విత్తనాన్ని అధీకృత సంస్థల నుంచి సేకరించి విత్తనోత్పత్తికి వాడాలి. విత్తిన 30-40 రోజుల సమయంలో తేలికపాటి తడి ఇస్తే దిగుబడి పెరిగి నాణ్యమైన విత్తనం లభించే వీలుంది.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



డా. శివకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి
చరవాణి సంఖ్య: 91002 29854

ప్రస్తుతం కందిని మచ్చల పురుగు ఆశిస్తోంది. నివారణ చర్యలు తెలపండి?
- సత్యనారాయణ, రైతు, తపాల్‌పూర్

✓ మచ్చల పురుగు నివారణకు 2.5 మిల్లీ లీటర్ల క్లోరోపైరిఫాస్ లేదా 0.75 మిల్లీలీటర్ల నోవల్యురాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

యాసంగిలో వేయదగిన ఆరుతడి పంటలు ఏవి? -వెంకటేష్, రైతు, కాసిపేట

✓ పంట మార్పిడి చేసి ఆరుతడి పంటలు వేయడం వల్ల నేల సారవంతంగా మారుతుంది. వేరుసెనగలో కదిరి-6, కదిరి-9, టీఏజీ-24 రకాలు వేసుకుంటే ఎకరానికి 8క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెసరలో ఎంజీటీ-295, డబ్ల్యూజీజీ-37, రకాలు 4 క్వింటాళ్లు, నువ్వులలో శ్వేత, హిమ, గౌరి రకాలు ఎకరాలకు 2.5 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది. ప్రస్తుత వానాకాలం పంట పూర్తి కాగానే వీటిని విత్తుకోవచ్చు.

పాడి.. లాభాలు దండి

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ఎంపిక చేసుకొని వాటిని నిత్య ఆదాయ మార్గాలుగా మార్చుకోవచ్చని నిరూపిస్తున్నారు తలమడుగు మండలం కజ్జర్లకు చెందిన మహిళా రైతు స్వాతిరెడ్డి. 2020లో కజ్జర్లలో తండ్రి స్వామిరెడ్డి ప్రోత్సాహంతో 20 ముర్రాజాతి గేదెలతో సొంత స్థలంలో డెయిరీఫాం ఏర్పాటు చేసుకున్నారు. నిర్వహణకు ఇద్దరు కూలీలను నియమించారు. పొలంలోనే 2 ఎకరాల స్థలంలో సూపర్ నేపియర్ గడ్డిని పెంచి ఏటా పాడిపశువుల గేదెలకు పచ్చిగడ్డి ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. పత్తిచెక్క, వరి తవుడు, పెసర చున్నీని దాణాగా పెడుతున్నారు. 2024 నాటికి మరో 30 గేదెలను కొని మొత్తం 50 గేదెలతో డెయిరీ ఫాం నిర్వహిస్తున్నారు. గేదెలు నిత్యం 150 లీటర్ల పాలు ఇస్తుండగా వాటిని ఆదిలాబాద్ పట్టణానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రతి నెల రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. కూలీలు, డెయిరీ ఫాం నిర్వహణ ఖర్చులకు రూ.1 లక్ష పోగా.. రూ.2 లక్షల లాభం వస్తోందని ఆమె తెలిపారు. ప్రతి పంట కాలం మొదట్లో పేడ విక్రయం ద్వారా అదనంగా రూ.1 లక్ష ఆదాయం వస్తోందన్నారు. ప్రస్తుతం నలుగురు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. మార్కెట్‌లో పాల విక్రయం అధికంగా ఉండటంతో ఏటా గేదెల కొనుగోలు చేస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడితే ఆశించిన లాభాలు వస్తాయంటున్నారు.



స్వాతిరెడ్డి



కజ్జర్లలో ఏర్పాటు చేసిన డెయిరీ ఫాంలో గేదెలు

ఆదర్శం


మొక్కజొన్నలు పశుగ్రాసంగా..

మీకు తెలుసా?

చాలా మంది రైతులు మొక్కజొన్న కంకులను ఎరువుగా, వంట చెరకుగా వాడుతున్నారు. ఈ కంకులలో మామూలు పశుగ్రాసాలలో ఉన్నట్లు 3-5 శాతం వరకు మాంసకృత్తులు, 55 శాతం పిండి పదార్థాలు ఉన్నాయి. ఈ కంకులను పశువులు నమిలి తినడం కష్టం. అందువల్ల వాటిని ఎండబెట్టి, యంత్రం ద్వారా పొడిగా చేసుకొని పశుగ్రాసాల కొరత సమయాలలో వాడుకోవచ్చు.

విద్యార్థి భవితవ్యానికి అపార్

న్యూస్‌టుడే, మంచిర్యాల విద్యావిభాగం :



జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ పేరిట ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు దేశంలోని ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఒక ప్రత్యేక ఐడీని అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కేటాయించనున్నారు. ఇది దేశంలో ప్రతి విద్యార్థికి అందించే గుర్తింపు నంబరు. ఆన్‌లైన్ నమోదుకు ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అన్ని జిల్లాల విద్యాశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లా వ్యాప్తంగా 4822 ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాలు, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలు కొనసాగుతున్నాయి. 4 లక్షల మందికి పైగా విద్యార్థులు ఆయా మాధ్యమాల తరగతుల్లో చదువుతున్నారు. పిల్లలకు పాఠశాల స్థాయిలో చైల్డ్ ఇన్‌ఫో ద్వారా ఒక ఐడీ, కళాశాల స్థాయిలో మరో ఐడీ ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అందించే అపార్ కార్డులోనే పూర్తి సమాచారం ఉండనుంది. అపార్‌కార్డు ద్వారా కేటాయించే సంఖ్య జీవిత కాలం ఐడీగా పరిగణిస్తారు. ఇందులో విద్యార్థికి సంబంధించిన కేజీ టూ పీజీ వరకు విద్యార్థి పూర్వ వివరాలు, సాధించిన విజయాలు, ఉపకార వేతనాలు, మెమోలు, ధ్రువపత్రాలు ఆధార్ అనుసంధానం ఉండటంతో కుటుంబ వివరాలు అందుబాటులో ఉంటాయి.

అంగీకారం తప్పనిసరి

కేంద్ర ప్రభుత్వం జారీచేసే ఈ అపార్‌కార్డు వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయి. దీనిని పొందేందుకు తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్ర మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇటీవల విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పించారు. గత శనివారం నిర్వహించిన పీటీఎం (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)లో ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో దీని గురించి వివరించారు. పాఠశాలల్లో, ఆధార్ కార్డులో వివరాలు ఒకేలా ఉండాలని లేనివారు మార్పులు చేసుకోవాలని సూచించారు. తర్వాత మార్పులకు అవకాశం ఉండదని.. అపార్ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ అంగీకార పత్రాలపై అవగాహన కల్పించారు.



అపార్ నమూనా కార్డు

కార్డులో పొందుపర్చే అంశాలు

డిజిటల్ కార్డుపై విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.

ఉపయోగాలు

- ✦ విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.
- ✦ అపార్ గుర్తింపుతో డిజీలాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యావిషయ విజయాలు, ధ్రువపత్రాలు డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చు.
- ✦ విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు, వివిధ విద్యాసంస్థల్లో చేరికలు, మార్పులు, ఉద్యోగాల భర్తీ సమయం ఇతర సందర్భాల్లో సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించేలా రూపొందించారు.

ఒకే ఐడీలో పూర్తి వివరాలు




కేంద్రం ప్రభుత్వం తీసుకొస్తున్న అపార్ కార్డు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనుంది. ఒకే నంబరులో విద్యార్థికి సంబంధించి పూర్తి వివరాలు నమోదుకానున్నాయి. దీనికి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చాం. ఇటీవల తల్లిదండ్రుల సమావేశాల్లో సైతం వారికి వివరించాం.

- ఎస్.యాదయ్య, డీఈవో మంచిర్యాల

కంది మొక్క.. 12 అడుగులు

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్‌లో కోన ఓదెలు ఇంటి ఆవరణలో ఏపుగా ఎదిగిన కంది మొక్క ఇది. సాధారణంగా కంది మొక్క మూడు నుంచి ఆరు అడుగులు పెరగడం సాధారణం. అలాంటిది వారి ఇంటి ముందు ఉన్న మొక్క 12 అడుగుల మేర పెరిగింది. ఇంటికన్నా ఎక్కువ ఎత్తు పెరిగిన ఆ చెట్టును గ్రామస్థులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. దీనిపై బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఇస్లావత్ తిరుపతిను సంప్రదించగా విత్తనాల్లో జన్యుమార్పిడి కారణంగా ఒక్కోసారి మొక్క పెరుగుదల అసాధారణంగా ఉంటుందన్నారు. ఇదే మొక్క నుంచి సేకరించిన విత్తనాలు ఇదే స్థాయిలో ఎదగకపోవచ్చని ఆయన తెలిపారు.



ఏపుగా ఎదిగిన కంది మొక్క వద్ద ఇంటి యజమాని ఓదెలు

- న్యూస్‌టుడే, లక్షెట్టిపేట

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : మందమర్రి రెండో జోన్‌కు చెందిన జి.సత్యఅన్వేష్ (21) అనే విద్యార్థి విద్యుదాఘాతంతో సోమవారం మృత్యువాత పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న సత్యఅన్వేష్ సోమవారం సాయంత్రం ఇంట్లో స్నానం చేసి టవల్ తీగపై ఆరవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే మందమర్రి డిస్పెన్సరీకి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆర్కేపీ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మందమర్రి ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.



జి.సత్యఅన్వేష్

పతుల కోసం సతుల పూజలు

ఘనంగా కర్వాచౌత్ పండగ

రెబ్బెన, న్యూస్‌టుడే: సాధారణంగా ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో కర్వా చౌత్ పండగను కనులపండువగా నిర్వహిస్తుంటారు. ఏడాదికి ఒకసారి వచ్చే కార్తిక మాసంలోని కృష్ణపక్ష చతుర్థి రోజున ప్రత్యేకంగా వివాహితులైన మహిళలు మాత్రమే దీన్ని ఆచరిస్తుంటారు. ఆ రోజు సూర్యోదయానికి ముందు ఉపవాసం ప్రారంభించి రాత్రి చంద్రుని దర్శనం తర్వాత ముగిస్తారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు రెబ్బెన మండల కేంద్రంలో స్థిరనివాసం ఏర్పర్చుకున్న పలు కుటుంబాలు ఈ పండగను ఘనంగా కొనసాగిస్తుంటారు.

గ్రామీణ ప్రాంత మహిళలే కాకుండా పట్టణాల్లోని వారు కూడా కర్వా చౌత్ ఉపవాసాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పాటు ఉత్సాహంగా పాటిస్తుంటారు. శాస్త్రాల ప్రకారం కార్తిక మాసంలోని కృష్ణ పక్షంలో చంద్రోదయ చతుర్థి రోజున వ్రతాన్ని ఆచరించాలి. కార్తీక కృష్ణ పక్ష చతుర్థి రోజున కర్కచతుర్థి (కర్వా చౌత్) ఉపవాసం పాటించే సంప్రదాయం ఉంది. భర్తలు ఎల్లప్పుడు యోగక్షేమాలతోపాటు దీర్ఘాయువుగా ఉండాలనే ఉద్దేశంతో సతులు పండగను నిర్వహిస్తారు. ఉదయం 4 గంటల నుంచి ఉపవాసం తీసుకొని కనీసం నీళ్లు కూడా తాగకుండా రాత్రి చంద్రుని దర్శనం కోసం ఎదురు చూస్తారు. బాలచంద్ర గణేష్‌కు పూజలు చేసిన తర్వాత అందరూ కలిసి తులసి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రి జల్లెడలో చంద్రుడిని దర్శించుకుని ఆహారం తీసుకోవడంతో ఉపవాసం ముగుస్తుంది.



తులసి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

శెభాష్ సంజయ్

● మూడు మైనింగ్ ఉద్యోగాలకు ఎంపికైన మిట్టపల్లి యువకుడు

న్యూస్‌టుడే, జైపూర్ :

సాదాసీదా మధ్య తరగతి కుటుంబం వారిది. తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నప్పటికి కుటుంబం పెద్దది కావడంతో వారిని పోషించడంలో చాలా కష్టాలను ఎదుర్కొన్నాడు. తనలా తన కుమారుడు కావొద్దని.. తను పనిచేసిన సింగరేణిలోనే అధికారిగా పని చేయాలని ఆయన కలలు కన్నాడు. తండ్రి పడ్డ కష్టం.. తన మీద పెట్టుకున్న ఆశలు మరింత బాధ్యతను పెంచాయి. దీంతో పట్టుబట్టి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు ఎగ్జిక్యూటివ్ స్థాయి మైనింగ్ ఉద్యోగాలు సాధించి శెభాష్ అనిపించారు రామటెంకి సంజయ్‌కుమార్.

మిట్టపల్లి గ్రామానికి చెందిన రామటెంకి పోషం-రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికన్న చిన్నవాడు సంజయ్. తండ్రి చిన్నతనంలోనే సింగరేణిలో ఉద్యోగ విరమణ కావడం... ఆయన ప్రోత్సాహంతో భవిష్యత్తులో తాను సింగరేణి అధికారి కావాలనే లక్ష్యంగా పెట్టుకున్నాడు. దీంతో 2013 ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కొత్తగూడెంలోని కొత్తగూడెం స్కూల్ ఆఫ్‌మైన్స్‌లో ఉత్తమ మార్కులతో బీటెక్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో కొంతకాలం జెన్‌టీయూలో ఒప్పంద అధ్యాపకుడిగా కూడా పని చేశాడు. అదే క్రమంలో జీవితంలో మరింత సాధించాలనే తపనతో గేట్ పరీక్ష రాసి 2020లో ఐఐటీ ధన్‌బాద్‌లో మైనింగ్‌లో ఎంటెక్ చేసి కాలేజీలో మొదటి ర్యాంకు సాధించి బంగారు పతకం కూడా అందుకున్నాడు. 2022లో మహారత్న కంపెనీ అయిన కోల్ ఇండియాలో అండర్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం మహారాష్ట్రలోని వెస్ట్రన్ కోల్ ఫీల్డ్ వాణి నార్త్ ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇదే క్రమంలో 2023లో మరో మహారత్న కంపెనీ అయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ)లో ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగం వచ్చినప్పటికి అందులో చేరలేదు. ఈ ఏడాది జులైలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపి అండర్ మేనేజర్‌గా ముచ్చటగా మూడో ఉద్యోగం సాధించగా తల్లిదండ్రుల కోరిక మేరకు సింగరేణిలోనే ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని కోరుకుంటున్నాడు సంజయ్.



ఐఐటీ ధన్‌బాద్ డైరెక్టర్ రాజీవ్ శేఖర్ నుంచి బంగారు పతకం అందుకుంటున్న రామటెంకి సంజయ్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఏజెన్సీలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులు వారి సమస్యలను వివరించారు. ఉట్నూరు మండలం బోయవాడకు చెందిన శంకర్ తనకు ఉద్యోగం ఇప్పించాలని, కాసిపేట మండలం మాలకెపల్లికి చెందిన ఆత్రం శంకర్ తన ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్ మంజూరు చేయాలని కోరారు. ఇచ్చోడ మండలం జల్దాకు చెందిన గణేష్ కిరాణ దుకాణం కోసం రుణం మంజూరు చేయాలని, దహేగాం మండలం దేవులగూడకు చెందిన సోములాల్ తన భూమి పట్టా చేయాలని కోరారు. రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలతో కూడిన అర్జీలు పలువురు సమర్పించారు. ఏపీఓ వసంత్‌రావు, ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ కుడ్మెత మనోహర్, ఈఈ భీంరావు, ఏవో దామోదర్‌రావు, పీహెచ్ఓ సందీప్‌కుమార్, డీపీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

నవంబరు 5 నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉట్నూరు కుమురం భీం ప్రాంగణంలో నవంబరు 5 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. సోమవారం పోటీల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్రీడాకారులకు వసతి, అందించాల్సిన భోజన సౌకర్యాలపై చర్చించారు. అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవానికి అతిథుల ఆహ్వానపత్రాలు, విద్యుత్తు, వైద్యం, ఆట వస్తువులు సకాలంలో సిద్ధం చేయాలని సూచించారు. ఏపీవో వసంత్‌రావు, ఈఈ భీంరావు, ఉమ్మడి జిల్లాల క్రీడల అధికారులు పాల్గొన్నారు.

అన్నయ్య ప్రోత్సాహంతో



ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో అశోక్, వందన దంపతుల కూతురు నిఖిత. డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికయ్యారు. తన అన్నయ్య, ఉపాధ్యాయుడు మంద కిరణ్ అన్ని రకాలుగా ప్రోత్సహించారన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆన్‌లైన్ యాప్‌తో విలువైన సలహాలు తీసుకున్నామని తెలిపారు. ఇవి ఉద్యోగ సాధనకు ఎంతో ఉపకరించాయని పేర్కొన్నారు.

మేస్త్రీ పని చేస్తూ



నేరడిగొండకు చెందిన ఇ.గంగాధర్ తల్లిదండ్రులు గంగారాం, పోసాని బీడీ కార్మికులుగా పని చేస్తారు. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ సాయంతో డిగ్రీ, కష్టాలు పడుతూనే బీఈడీ పూర్తి చేశారు. వివాహం తర్వాత బతుకుదెరువు కోసం మేస్త్రీగా పని చేయాల్సి వచ్చింది. డీఎస్సీ కోసం బీసీ స్టడీ సర్కిల్‌లో చేరి స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు.

తల్లిదండ్రులు గర్వపడేలా



తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన నర్సమ్మ, శంకర్‌ల కూతురు జ్ఞాన ప్రగతి. చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేది. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో మూడో ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపిక కాగా, భాషా పండితురాలుగా ఆరో ర్యాంకు సాధించారు. క్రమం తప్పకుండా బీసీ స్టడీ సర్కిల్‌కు వెళ్లి తోటి విద్యార్థులతో కలిసి చదువుకున్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా ఉద్యోగం సాధించారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగాల సాధన

ప్రభుత్వ స్టడీ సర్కిళ్ల ద్వారా 77 మంది ఎంపిక

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే:

ప్రభుత్వ స్టడీ సర్కిళ్లు నిరుద్యోగులకు వరంగా మారాయి. ఉద్యోగాల సాధనకు అవసరమైన సదుపాయాలను ఉచితంగా కల్పిస్తున్నాయి. మెరుగైన వసతులుండటం, స్టడీ మెటీరియల్‌ను అందిస్తుండటంతో నిరుద్యోగ యువతలో మార్పు వస్తోంది. సివిల్స్, గ్రూప్స్‌వంటి ఉద్యోగాలతోపాటు అన్ని రకాల ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేందుకు శిక్షణ ఇస్తున్నారు. మరి కొందరు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్టడీ హాళ్లలో సాధన చేస్తున్నారు. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులను ఏర్పాటు చేసి అభ్యర్థులకు విద్య, ఉద్యోగరంగాలకు సంబంధించిన సమాచారం, ఉద్యోగ ప్రకటనలు చేరవేస్తున్నాయి.

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల్లో 77 మంది స్టడీ సర్కిళ్లలో సాధన చేసినవారే కావడం గమనార్హం. బీసీ స్టడీ సర్కిల్‌లో సాధన చేసిన వారిలో 51 మంది ఉద్యోగాలు సాధించారు. ఇందులో 34 మంది ఎస్జీటీలుకాగా 17 మంది స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొందారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారిలో మొత్తం 26 మందికి ఉద్యోగాలు వచ్చాయి. అందులో ఎస్జీటీ 17 మంది, స్కూల్ అసిస్టెంట్‌కు 9 మంది ఎంపికయ్యారు.



బీసీ స్టడీ సర్కిల్ హాలులో చదువుకుంటున్న యువతులు

కన్నవారి కల నెరవేర్చారు



ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్‌లో స్థిరపడ్డ బత్తుల సత్యనారాయణ, సునీతల పెద్ద కూతురు సృష్టి. భీంసరి గ్రామంలోని ఎకరం పొలంలో తల్లిదండ్రులు కష్టపడి ఇద్దరు కూతుళ్లను చదివించారు. సృష్టి బీసీ స్టడీ సర్కిల్‌లో చేరి ఆన్‌లైన్ యాప్‌తో ఉద్యోగ సాధనకు విలువైన చిట్కాలు తెలుసుకున్నారు. ఎస్జీటీగా ఎంపికై తల్లిదండ్రుల కల నెరవేర్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

భీమిని, న్యూస్‌టుడే:
? భీమిని మండలంలోని మామిడిగూడ, పెద్దపేట గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- వాహనచోదకులు**
✔ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. **- సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, భీమిని**


స్టాళ్లలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

మార్కెట్‌లో విక్రయాలు ప్రారంభం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : బెల్లంపల్లి ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. ఇన్నాళ్లు నిత్యం వర్షంలో తడుస్తూ, వేసవిలో ఎండను భరిస్తూ, చలి కాలంలో వణుకుతూ కూరగాయల వ్యాపారులు అవస్థలు పడ్డారు. ప్రస్తుతం ఆ బాధలు దూరమయ్యాయి. ఈ నెల 20న మున్సిపల్ కార్యాలయంలో 108 మంది వ్యాపారులకు సంబంధించి స్టాళ్ల ఎంపికకు డ్రా తీశారు. ఎట్టకేలకు కూరగాయల మార్కెట్‌లో సోమవారం అమ్మకాలు ప్రారంభమయ్యాయి. వ్యాపారస్తులంతా తమ తమ స్టాళ్ల వద్ద ప్రత్యేక పూజలు చేసి అమ్మకాలను ప్రారంభించుకున్నారు. 108 మందితో పాటు గ్రామాల నుంచి వచ్చే మహిళా రైతులకు ఇందులోనే స్థలం కేటాయించారు. గ్రామీణ రైతుల కోసం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్మించిన రైతు బజార్ ఏర్పాటయ్యేదాకా ఇదే మార్కెట్‌లో కూరగాయలను విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. కూరగాయల మార్కెట్‌ను రూ.7.50 లక్షలతో నిర్మించారు. మార్కెట్ ప్రారంభంతో కాంటాచౌరస్తాలో రోడ్లన్నీ విశాలంగా మారాయి. రోడ్లపై ఎట్టిపరిస్థితుల్లో కూరగాయల విక్రయాలకు అనుమతి ఉండదని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఏసీసీ, న్యూస్‌టుడే : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఆయా శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జాతీయ స్థాయి మానిటరింగ్ సభ్యులు సి.వి. బాలమురళి, కె.హెచ్. సునీల్, జిల్లా గణాంక అధికారి సత్యం, గ్రామీణ విద్యుత్తు అధికారి కిషన్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 15 నుంచి 19 వరకు ఎంపిక చేసిన 4 మండలాల్లోని 10 గ్రామ పంచాయతీల్లో కేంద్ర బృంద సభ్యులు పర్యటించి పరిశీలించిన అంశాలు, పనులపై చర్చించారు.

బకాయిలు రాక.. భవనానికి తాళం

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి మండలం కన్నాలలోని శ్రీబుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో రూ.50లక్షలు వెచ్చించి కాలక్షేప మండపాన్ని నిర్మించారు. అధికారులు, నాయకుల సమన్వయలోపంతో భవన పనులు పూర్తైనా సదరు దేవాదాయశాఖ భవనాన్ని స్వాధీనం చేసుకోలేదు. రావాల్సిన బకాయిలు రాకపోవడంతో పాటు ఇతరత్రా పరీక్షలకు అధికారులు రావడంలో జాప్యం చేయడంతో గుత్తేదారు కాలక్షేప మండపానికి తాళం వేశారు. నాలుగురోజులైనా దేవాదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఆలస్యంగా వెలుగుచూసింది.

వెతలు చెప్పుకొని.. వేదన తీర్చమని

ఏసీసీ, న్యూస్‌టుడే : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణికి అర్జీదారులు బారులు తీరారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల విభాగానికి వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదు దారులు తరలి వచ్చారు. కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఆర్డీవో రాములు బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.



బాధితుల నుంచి ఫిర్యాదులను తీసుకొంటున్న కలెక్టర్ కుమార్ దీపక్

పంటరుణాలు ఇప్పించాలి



ఆదివాసీ కొలవార్ తెగకు చెందిన మాకు గత ప్రభుత్వ హయాంలో పోడు భూములకు సంబంధించి హక్కు పత్రాలు జారీచేశారు. వీటికి సంబంధించి రైతు బంధు కూడా జమయ్యాయి. ఖరీఫ్ సీజన్ సాగుకు రుణాల కోసం బ్యాంకుకు వెళ్తే తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్తున్నారు. పంట రుణాలు అందించి తమను ఆదుకోవాలి.
- ఆదివాసీ రైతులు, పంగిడిసోమారం, కోటపల్లి

డీఎస్సీ పోస్టింగ్ ఇవ్వాలి



డీఎస్సీ 2024 నియామకాల్లో 22వ ర్యాంకుతో ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టుకు ఎంపికయ్యా. నాతో పాటు ఎంపికైన వారికి పోస్టింగ్ ఇచ్చినా అర్హత ఉన్న నాకు ఇప్పటికీ నియామకాలు చేపట్టలేదు. డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ అర్హత లేని మరో అభ్యర్థి నా ఎంపికపై అభ్యంతరాలు చెప్పడంతో నాకు పోస్టింగ్ రాలేదు. అర్హురాలినైన తనకు మరోసారి ధ్రువపత్రాలు పరిశీలించి న్యాయం చేయాలి.
- కంది దివ్య, లక్షెట్టిపేట

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



మేము బెల్లంపల్లి మండలం భూదకలాన్‌కి చెందిన నిరుపేదలం. ఇళ్లు, స్థలాలు లేకపోవడంతో కొన్నేళ్ల నుంచి సింగరేణి సంస్థ అతిథి గృహం ఏరియాలోని కూలిపోయి, నిరుపయోగంగా ఉన్న క్వార్టర్స్‌లో ఉన్నాం. ప్రస్తుతం అక్కడ సింగరేణి సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తుండటంతో అక్కడి నుంచి మమ్మల్ని అధికారులు వెళ్లగొట్టారు. గతంలో మాకు పెద్దబూదె శివారులోని భూమి కేటాయించగా ప్రస్తుతం గుడిసెలు వేసుకోగా కూలగొట్టారు. ఎలాంటి ఆధారం లేని మాకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలి.
- నిరుపేదలు, భూదకలాన్ గ్రామం, బెల్లంపల్లి

వేతనాలు రాక ఇబ్బందులు



జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల వసతిగృహాల్లో పొరుగుసేవల పద్ధతిన 18 మంది ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్నాం. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు, గత ఏడాదికి సంబంధించి 7 నెలలకుగానూ మాకు ఇప్పటికీ జీతాలు అందించలేదు. సకాలంలో వేతనాలు చేతికందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
- గిరిజన ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంలు, మంచిర్యాల

అభివృద్ధి పనులు చేపట్టడం లేదు

క్యాతనపల్లి పురపాలిక పరిధిలోని 5వ వార్డుకు సంబంధించి అమరవాదిలో వివిధ అభివృద్ధి పనులకు డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి 2023లో రూ. 59 లక్షలు మంజూరయ్యాయి. ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ వార్డును సందర్శిస్తున్నా పనులు మాత్రం చేపట్టడం లేదు.



- మహేష్, 5వ వార్డు కౌన్సిలర్

కస్తూర్బాల్లో 14 ఖాళీల భర్తీ


ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : నిరుపేదల బాలికల చదువుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన కస్తూర్బా పాఠశాలలు, కళాశాలల్లో పూర్తి స్థాయి బోధకులు లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఎట్టకేలకు దూరమయ్యాయి. ఇన్నాళ్లు ఆయా విద్యాలయాల్లో పని చేసిన వారు వివిధ నోటిఫికేషన్‌లలో భాగంగా గురుకులాల్లో ఉద్యోగాలు రాగా పలువురు ఇతర కొలువుల్లో చేరారు. ఇటీవల అంతర్‌జిల్లా, జిల్లా స్థాయిలో బదిలీలు చేపట్టిన ప్రభుత్వం వారు విధుల్లో చేరగా మిగిలిన ఖాళీ స్థానాలను భర్తీ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. గత నియామక పరీక్ష(2023జులై)లో నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించిన మెరిట్ జాబితా ఆధారంగా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించగా ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున ఎంపికచేసి గత సెప్టెంబర్ 25న జిల్లా కేంద్రంలోని సైన్సు సెంటర్‌లో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. నియమ నిబంధనల మేరకు అర్హులైన 14 మందిని జిల్లాలోని ఆయా కస్తూర్బాలకు కేటాయిస్తూ సోమవారం డీఈవో యాదయ్య ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో భాగంగా ఒక ప్రత్యేకాధికారి పోస్టుతో పాటు 6 పీజీ సీఆర్టీ, 7 సీఆర్టీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

అధికారులు రారు.. ప్రజా సమస్యలు పట్టవు

కాసిపేట, న్యూస్‌టుడే : మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో అధికారులకు ప్రజా సమస్యలు పట్టడం లేదు. కాసిపేట కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో ఉదయం 10:45 వరకు అధికారులు ఎవరూ కనిపించలేదు. తర్వాత కొద్ది సేపటికి రెవెన్యూ అధికారి వచ్చారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి మండల అధికారులు హాజరుకావడం లేదని పలువురు వాపోతున్నారు.


ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న మండల పరిషత్తు కార్యాలయం

తాటి చెట్టుపై పిడుగుపాటు

జైపూర్ : మండలంలో నర్వ గ్రామ శివారులో సోమవారం కురిసిన వర్షానికి పిడుగు పడింది. స్థానికుల వివరాల ప్రకారం... నర్వ గ్రామ శివారులోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఓ పెట్రోల్‌పంపు సమీపంలోని తాటి చెట్టుపై పిడుగుపాటు సంభవించింది. స్థానికులు, పోలీసులు ద్వారా విషయం తెలుసుకున్న ఎస్టీపీపీ ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ఆలోచించి రాసి.. ప్రతిభ చాటి


శ్రీ చైతన్య పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ జి.సంజీవ్

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంపై లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు జరిగాయి. 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రథమ స్థానంలో బొల్లోజు బాలాజీ, ద్వితీయ స్థానంలో మాసాడి శ్రీవిద్య, తృతీయ స్థానంలో ఎన్.సిరి నిలిచారు. ఆలోచించేలా వ్యాసాలను రాసి ప్రతిభ చాటారు. విజేతలకు ప్రిన్సిపల్ జి. సంజీవ్, ఉపాధ్యాయులు పి. సతీష్ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

మంచిర్యాల విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని స్థానిక సెవెన్ హిల్స్ హై స్కూల్ ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను ఏర్పాటుచేశారు. 'అంతర్జాల వినియోగంపై లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాఠశాలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రథమ స్థానంలో మలిహా జరీన్(10వ), ద్వితీయ స్థానంలో జైదిత్య పరీక్(10వ), తృతీయ స్థానంలో కె.అశ్విత నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ గోనె భాగ్యలక్ష్మి, పాఠశాల ఇన్‌ఛార్జి బి.వెంకటేశ్వర్లు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


మంచిర్యాల: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు

సంక్షిప్తం


పురస్కారం అందుకున్న శ్రీనివాస్‌తో నిర్వాహకులు

టీజీఎంసీ సభ్యుడికి పురస్కారం

మంచిర్యాల వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ ఆసుపత్రి నిర్వాహకుడు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ)సభ్యుడు డా. ఎగ్గెన శ్రీనివాస్‌కు 2024 సంవత్సరానికి గాను డా.ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో అందించిన సేవలు, ప్రస్తుతం చేస్తున్న అధునాతన శస్త్ర చికిత్సలకు సోమవారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో యాక్ట్ నౌ సంస్థ ఈ పురస్కారాన్ని అందించినట్లు డా.శ్రీనివాస్ తెలిపారు.

నాయకుల పరామర్శ

హాజీపూర్ : మండల భారాస నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై మండలంలోని రాపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఇటీవల దాడిని ఖండిస్తూ అధైర్య పడవద్దని సోమవారం భారాస వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్‌లో హాజీపూర్ మాజీ ఎంపీపీ స్వర్ణలతను పరామర్శించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి మండలంలోని రాపల్లిలో మాజీ ఎంపీపీ స్వర్ణలతను ఆమె నివాసంలో పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భారాస అండగా ఉంటుందని వివరించారు.

ఎస్సీ వర్గీకరణ విరమించుకోవాలని డిమాండ్

జన్నారం : ఎస్సీ వర్గీకరణ చేసే ఆలోచనను ప్రభుత్వాలు విరమించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు.

ఎస్సైగా శ్వేత బాధ్యతల స్వీకరణ



భీమారం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నూతన ఎస్సైగా శ్వేత ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. భీమారం ఎస్సైగా విధులు నిర్వహించిన రాములు రామగుండం కమిషనరేట్‌కు బదిలీ కాగా చెన్నూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్సైగా పని చేసిన శ్వేత ఇక్కడికి వచ్చారు.

భారాస నాయకురాలి మృతిపై సంతాపం

రామకృష్ణాపూర్ : మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన భారాస మహిళా విభాగం సీనియర్ నాయకురాలు బొలిశెట్టి స్వరూప(45) సోమవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. భారాస పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, ఇతర నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు.

జవాన్‌కు సన్మానం

దండేపల్లి గ్రామీణం: దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన అబ్దుల్ వహీద్ దేశ సరిహద్దులో జవాన్‌గా సేవలందించారు. 22 ఏళ్లుగా దేశం కోసం పని చేసి ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామానికి రావడంతో ఆయనతో చదువుకున్న పదో తరగతి మిత్రులు ఘనంగా సత్కరించారు.

అమర వీరుల త్యాగాలు మరువలేనివి

రామకృష్ణాపూర్ : పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేవని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం మందమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏసీపీ రవికుమార్ పోలీస్ అమర వీరుల స్తూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

లక్షెట్టిపేట : పట్టభద్రుల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఎమ్మెల్సీ బరిలో నిలుస్తున్నట్టు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, ఆదిలాబాద్- మెదక్ - కరీంనగర్ - నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల విద్యా సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులతో పట్టణంలోని ఓ వేడుకల మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.

పాక్షికంగా కూలిన ఇల్లు

జైపూర్ : ఇందారం గ్రామంలోని దొరగారిపల్లిలో సోమవారం ఉదయం ఇళ్లు కూలిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో మల్లమ్మతో పాటు కుమారుడు సురేష్ నిద్రిస్తున్న క్రమంలో ఇంటి వెనుక భాగం ఆకస్మాతుగా కుప్పకూలింది. వీరిద్దరూ ముందు భాగంలో నిద్రిస్తుండగా వెనుక వైపు కూలింది. ఇది ఇలా ఉంటే ఇంటికి సమీపంలోనే ఇందారం ఉపరితల గని ఉండటం.. అక్కడ బొగ్గు కోసం ఇష్టారీతిన బ్లాస్టింగ్ చేయడంతో తమ ఇళ్లు కూలిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూ సింగరేణి యాజమాన్యం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా కూలిన ఇంటిని పీవో వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు రక్షణాధికారి సతీష్ పరిశీలించి సివిల్ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు.


శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో మహిళలు నృత్య ప్రదర్శన

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఆదివారం రాత్రి ఫ్యామిలీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వేడుకల వల్ల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు.

కార్మికుల శ్రమ దోపిడీ

జైపూర్, న్యూస్‌టుడే : ఎన్టీపీసీ వంటి విద్యుత్తు ఉత్పత్తి సంస్థలో ఒప్పంద కార్మికులకు అన్ని రకాల అలవెన్స్‌లు, సౌకర్యాలు కల్పిస్తే సింగరేణి యాజమాన్యం మాత్రం కార్మికులను శ్రమ దోపిడి చేస్తుందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్టీపీపీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీపీపీలో 1400 మంది కార్మికుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఓటింగ్ నిర్వహించామని అందులో 1021 మంది కార్మికులు సమ్మెకు వెళ్లడానికి అనుకూలంగా మరో 9 మంది సమ్మె వద్దని ఓటు వేశారని తెలిపారు. ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఎస్టీపీపీ నాయకులు సంపత్, సాయికృష్ణారెడ్డి, విక్రమ్, సంతోష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం

నస్పూర్, న్యూస్‌టుడే : సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో పలువురు ఐఎన్‌టీయూసీలోకి చేరడంతో వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ పోరాటం ఫలితంగానే యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో కొత్త హక్కు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

బకాయిలు చెల్లించాలి

నస్పూర్ : సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.33 వేల కోట్లు వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్సార్పీ-3 గని ద్వార సమావేశంలో మాట్లాడారు.

హామీలు విస్మరించిన గుర్తింపు సంఘాలు

నస్పూర్ : సింగరేణి ఎన్నికల సమయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు కార్మికులకు ఇచ్చిన హామీలు విస్మరించాయని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ హెచ్ఎంఎస్ యూనియన్ కార్యాలయం వద్ద మాట్లాడారు.

రామకృష్ణాపూర్ : సింగరేణి ఎన్నికల్లో గుర్తింపు సంఘం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జే.శ్రీనివాస్ అన్నారు. సోమవారం మందమర్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

సింగరేణి సమాచారం

రెస్క్యూ పోటీల్లో ప్రతిభ

రామకృష్ణాపూర్: రామగుండం-2 ఏరియాలోని రెస్క్యూ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల్లో ప్రతిభ చాటిన మందమర్రి ఏరియా రెస్క్యూ సిబ్బందిని ఏరియా జీఎం దేవేందర్ అభినందించి సత్కరించారు. సోమవారం మందమర్రి జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జోనల్ రెస్క్యూ పోటీల్లో ఏరియాకు బెస్ట్ ఫస్ట్ ఎయిడ్, బెస్ట్ సెకండ్ రెస్క్యూ రికవరీ, ఓవరాల్ మూడు బహుమతులు సాధించినట్లు తెలిపారు. దన్బార్‌లో జరిగే ఆల్ ఇండియా మైన్స్ రెస్క్యూ పోటీల్లో మందమర్రి ఏరియా, బెల్లంపల్లి రీజియన్ రెస్క్యూ స్టేషన్ నుంచి గణేష్ రామన్, సాంబశివుడు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు.

స్విమ్మింగ్‌లో విశ్రాంత కార్మికుడి ప్రతిభ

రామకృష్ణాపూర్ : తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 9వ తెలంగాణ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో క్యాతనపల్లి పుర పరిధిలోని గద్దెరాగడి అమ్మా గార్డెన్స్ ఏరియాకు చెందిన పప్పు నారాయణ ప్రతిభ చాటాడు. 60 ఏళ్ల పైబడి వయస్సు విభాగంలో ఫ్రీస్టైయిల్ 400 మీటర్ల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. బట్టర్‌ఫ్లై50 మీటర్ల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

నేర వార్తలు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : బెల్లంపల్లిలోని మహ్మద్‌ఖాసీంబస్తీకి చెందిన చీర్ల హిమకార్తీక్ (35) అనే యువకుడు సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బెల్లంపల్లి మొదటి పట్టణ పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. హిమకార్తీక్‌కి తన భార్యతో గణేష్ నిమజ్జనం రోజు గొడవ జరగడంతో అతని భార్య, ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. భార్య, పిల్లలపై బెంగతో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వ్యక్తి రిమాండ్

కోటపల్లి, న్యూస్‌టుడే : కోటపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు సంబంధించిన పలువురు ఖాతాదారుల ఖాతాల నుంచి వారి ప్రమేయం లేకుండా తన ఖాతాలోకి డబ్బులు మళ్లించుకున్న వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండంపేట్ గ్రామానికి చెందిన గావిడి భీమయ్య అనే ఖాతాదారుడు ఈ నెల 3న తన ఖాతా నుంచి రూ.6 వేలు తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్లాడు. నిరక్షరాస్యుడైన భీమయ్య అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న నక్కలపల్లి గ్రామానికి చెందిన చల్ల సాయిరెడ్డి అనే వ్యక్తి భీమయ్య ఖాతా నుంచి రూ.6 వేలు తీసుకునేలా విత్‌డ్రా ఓచర్ రాసిస్తూ మరో రూ.59 వేలు తన ఖాతాకు మళ్ళేలా మరో ఓచర్ రాసిచ్చి క్యాషియర్ దగ్గరికి పంపాడు. ఓచర్‌లో నింపిన వివరాల ప్రకారం బ్యాంకు నుంచి ఒకరికి నగదు చెల్లింపు మరో ఖాతాకు మళ్లింపు జరిగింది. ఇంటికి వెళ్లిన భీమయ్య తనకు వచ్చిన చరవాణి సందేశాన్ని గమనించి తిరిగి బ్యాంకుకు వచ్చి ఆరా తీయగా తనకు తెలియకుండా సాయిరెడ్డి తన ఖాతాకు రూ.59 వేలు మళ్లించుకున్నట్లు తెలిసింది. భీమయ్య కుమారుడు సతీష్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టగా సాయిరెడ్డి బ్యాంకులో ఉంటూ 17 మంది ఖాతాదారులకు సంబంధించిన ఖాతాల నుంచి వారి ప్రమేయం లేకుండా రూ.8,38,255 లను తన ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాయిరెడ్డిని రిమాండు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో కారు దగ్ధం

చెన్నూరు గ్రామీణం: చెన్నూరు మండలంలోని కిష్టంపేట జిన్నింగ్ మిల్లు సమీపంలో సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో కారు దగ్ధమైంది. సుందర్‌శాల గ్రామానికి చెందిన చిట్యాల కరుణాకర్ తన కారులో చెన్నూరు మీదుగా మంచిర్యాలకు వెళ్తున్నాడు. కిష్టంపేట సమీపంలో ఒక్కసారిగా కారు ముందు భాగం నుంచి పొగలు రావడంతో కిందికి దిగాడు. అందులో నుంచి మంటలు చెలరేగడంతో చెన్నూరులోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు.


కాలిపోయిన కారు

దొంగతనం కేసులో రెండేళ్ల జైలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : బెల్లంపల్లి పట్టణం కెమికల్ ఏరియా హన్‌మాన్ గుడిలో 2022 అక్టోబరు 19న దొంగతనం జరిగింది. ఆలయంలోని బీరువాలో ఉన్న నాలుగు తులాల వెండి హారం, 20 తులాల రెండు వెండి కిరీటాలు, రూ.800 నగదు ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి శ్రీరాంభట్ల హరీష్‌శర్మ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహించి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితులు ఎండీ.బద్రుద్దీన్, సయ్యద్ సికిందర్ అలీలకు బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.50 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు రెండో పట్టణ ఎస్సై మహేందర్ తెలిపారు.

మరో కేసులో ఏడాది...

బెల్లంపల్లిపట్టణం : బెల్లంపల్లి పట్టణంలోని చౌడేశ్వరి హైటెక్ మద్యం దుకాణంలో 2024 మార్చి 2న రూ.53 వేలతో పాటు రూ.60 వేల విలువైన మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు దుకాణం యజమానులు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో గుండేటి రాకేష్ అనే వ్యక్తికి ఏడాది జైలుతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్ తీర్పు వెలువరించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

జూద స్థావరం నిర్వాహకుడి అరెస్టు

కోటపల్లి, న్యూస్‌టుడే : కోటపల్లి మండలం షెట్‌పల్లి శివారులో జూద స్థావరం నిర్వహిస్తూ పట్టుబడ్డ తాండ్ర పోచం అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఈ ఏడాది మార్చి 29న పట్టుబడగా తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ తన ప్రవర్తనలో మార్పురాకపోగా ఈ నెల 2న జరిపిన పోలీసుల దాడుల్లో మరోసారి పట్టుబడటంతో కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

గంజాయి తాగిన నలుగురు..

హాజీపూర్, న్యూస్‌టుడే : మండలంలోని రాపల్లి శివారులో గంజాయి తాగుతున్న నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. గ్రామంలో గంజాయిని సేవిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఆ ప్రాంతంలో గాలింపులు జరపగా నలుగురుని పట్టుకుని వారి వద్ద నుంచి 83 గ్రాముల గంజాయి, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గొర్రె పొట్టేలు దొంగతనం

బెల్లంపల్లి పట్టణం : పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో గొర్రె పొట్టేలు దొంగతనానికి గురైంది. సోమవారం కన్నెపల్లి మండలం వీగాం గ్రామానికి చెందిన ఎం.మల్లేష్ అనే వ్యక్తి కొత్తబస్టాండ్ ఏరియాలో గొర్రెల మందను మేపుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల ఖమ్మం నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చిన పొట్టేలును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాపలదారుడు పోలీసులను సంప్రదించగా విచారణ చేస్తున్నారు.